నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 13 మే 2025 | SANGAREDDY

# తూకంలో మోసం వాస్తవమే

- బచ్చురాజ్‌పల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో అధికారుల విచారణ
- రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- డీపీఎం మోహన్


బచ్చురాజ్‌పల్లిలో విచారణ చేపడుతున్న డీపీఎం మోహన్, డీసీఎస్‌వో జగదీశ్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నిజాంపేట, మే 12: 'కొనుగోలు కేంద్రం తూకంలో మోసం' శీర్షికకు 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లాస్థాయి అధికారులు స్పందించారు. డీపీఎం మోహన్, డీసీఎస్‌వో జగదీశ్, తహసీల్దార్ శ్రీనివాస్ బచ్చురాజ్‌పల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతు లు, సెంటర్ నిర్వాహకులతో సమావేశమై విచారణ చేపట్టారు. ధాన్యం తూకం వేసే క్రమంలో బస్తాకు 1.50 కిలోల వరకు మోసం జరిగింది వాస్తవమేనని అధికారులు నిర్ధారించారు. దీంతో వీవోఏగా పనిచేస్తున్న మంజులను తొలిగించారు. పూర్తి నివేదికను ఉన్నతస్థాయి అధికారులకు అందజేస్తామని డీపీఎం మోహన్ తెలిపారు. కొనుగోలు కేంద్రం నిర్వాహణ బాధ్యతను సీసీ లక్ష్మికి అప్పజెప్పారు. రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని, ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. విచారణలో ఆర్ఐ ఇమాద్, రైతులు నరేందర్‌నాయక్, రాజు, లింగం, పోచయ్య ఉన్నారు.

# ధాన్యం కొనుగోలులో గోల్‌మాల్

## 50 బస్తాల ధాన్యం తక్కువగా రావడంతో లబోదిబోమంటున్న పాపన్నపేట కౌలు రైతు


50 బస్తాల ధాన్యం తక్కువగా రావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

- లోడ్ చేసుకొని ట్రక్ షీట్ లేకుండానే రైస్‌మిల్లుకు వెళ్లిన లారీ
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐకేపీ నిర్వాహకులు
- న్యాయం చేయాలంటున్న కౌలు రైతు భూమయ్య

పాపన్నపేట, మే 12: కొనుగోలు కేంద్రంలో 50 బస్తాల ధాన్యం గోల్‌మాల్ అయినట్లు మెదక్ జిల్లా పాపన్నపేట కౌలు రైతు బైండ్ల భూమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ట్రక్ షీట్ లేకుండానే ధాన్యం రవాణా జరిగిందని, రెండు రోజుల తర్వాత తనకు చెందిన 50 బస్తాల ధాన్యం తక్కువగా వచ్చినట్లు ఐకేపీ సభ్యులు చెబుతున్నారని వాపోయారు. వివరాల్లోకి వెళితే... పాపన్నపేట పెద్ద ఎస్సీ వాడ వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన కౌలు రైతు బైండ్ల భూమయ్య, బట్టి భారతి, ప్రభాకర్, నదరి నారాయణ, చోటు, కుర్మ కిషన్లకు చెందిన 766 వడ్ల బస్తాలను లారీలో లోడ్ చేసినట్లు బాధిత రైతు తెలిపాడు. అందులో తనవి 391 బస్తాలు ఉన్నాయన్నాడు. 389 బస్తాల వరకు లెక్క బెట్టి డ్వాక్రా గ్రూపు సభ్యురాలు చాక్ పీస్‌తో సంఖ్య రాసిందన్నారు. అనంతరం రెండు సంచులు తెచ్చి తూకం చేసి లెక్క రాయించానన్నాడు. శనివారం ఉదయం ట్రక్ షీట్ లేకుండానే లారీ లక్ష్మీనగర్ ప్రాంతంలో ఓ రైస్‌మిల్లుకు వెళ్లిందన్నాడు. ఆదివారం ఐకేపీ సభ్యులు తనకు చెందిన 50 బస్తాలు తక్కువగా వచ్చినట్లు సమాచారం ఇచ్చారని వాపోయాడు. ఇతరుల భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశానని, ఇప్పుడు సుమారు 20 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా చూపడంతో సుమారు రూ. 47 వేల నష్టం వస్తుందన్నాడు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఈ విషయమై కమ్యూనిటీ కోఆర్డినేటర్ శివరాణిని వివరణ కోరగా చీకటి కావడంతో కమిటీ మెంబర్లు లోడ్ కాకముందే ఇంటికి వెళ్లారని, మిగతా సంచులు లోడ్ చేద్దామని శనివారం ఉదయం కేంద్రం వద్దకు వచ్చేసరికి లారీ లోడ్ చేసుకొని ట్రక్ షీట్ లేకుండానే వెళ్లి పోయిందన్నారు. ట్రక్ షీట్‌పై కమిటీ మెంబర్ల సంతకం ఉంటుందన్నారు. తర్వాత ట్రక్ షీట్ రైస్ మిల్లుకు పంపినట్లు చెప్పారు. అనంతరం 50 సంచులు తక్కువగా వచ్చినట్లు చెప్పారన్నారు. హమాలీలు కూడా క్వింటాలుకు రూ.40 తీసుకుంటున్నందున వారి వద్ద కూడా లారీలో ఎన్ని బస్తాలు వెళ్లింది లెక్క ఉంటుందన్నారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

# యుద్ధం నిలిపివేయడంపై ప్రధాని సమాధానం చెప్పాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ టౌన్, మే 12: దేశంలో అమాయకులను చంపిన వారిపై యుద్ధం చేయకుండా అర్థాంతరంగా నిలిపివేయడంపై ప్రధానమంత్రి మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అమెరికా పెట్టిన ట్విట్టర్ ద్వారా యుద్ధాన్ని నిలిపివేసి దేశ ప్రజలను ఆశ్చర్యానికి లోనుచేశారని విమర్శించారు. గతంలో యుద్ధాన్ని సమర్థవంతంగా నిర్వహించిన మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అమాయకుల బలిదానాలు, వారి కుటుంబాల ఆవేదనకు ప్రధానమంత్రి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. యుద్ధం నిలిచిపోవడంపై దేశ ప్రజల్లో తీవ్రమైన చర్చ జరుగుతున్నదని, కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా మద్దతునిచ్చిన విషయాన్ని ఆయన వివరించారు. ప్రధానమంత్రి మోదీ తీసుకున్న నిర్ణయం దేశ ప్రజలను అవమానానికి గురిచేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కేడం లింగమూర్తి, చిత్తారి రవీందర్, జంగపల్లి అయిలయ్య, ఎగ్గిడి అయిలయ్యతో పాటు పలువురు ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

- ప్రజావాణిలో 74 దరఖాస్తుల స్వీకరణ
- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మే 12 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు, జడ్పీసీఈవో ఎల్లయ్య, ఇతర అధికారులతో కలిసి ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజావాణిలో భూ సమస్యలు-23, పింఛన్లు-4, ఇందిరమ్మ ఇండ్లు -9, ఉపాధి ఉద్యోగాల కోసం-1, ఇతర సమస్యలు -37 మొత్తం కలిపి 74 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆ వినతులను సంబంధిత శాఖ అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, ఎలాంటి అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వినతులకు తప్పకుండా పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని అధికారులు ప్రజలకు కలిగించేలా ప్రత్యేక శ్రద్ధ వహించి.. క్షేత్రస్థాయిలో త్వరగా విచారణ చేసి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సోమవారం తాగునీటి కోసం శాంతినగర్ తండాలో ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

- తాగునీటి కోసం కర్ణాటక గ్రామాలకు పరుగులు
- అధ్వానంగా మారిన శాంతినగర్ తండా రోడ్డు
- ఆదుకునే దిక్కు లేదని గిరిజనుల ఆక్రోశం
- గోస పడుతున్న శాంతినగర్ తండా
- కాంగ్రెస్ పాలనపై గిరిజనుల నిట్టూర్పు


ట్యాంకర్ ద్వారా తాగునీరు పట్టుకుంటున్న మహిళలు


రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్న తండావాసులు

# తల్లడిల్లుతున్న తండాలు!

## పట్టింపులేని పాలకులు.. రోజుల తరబడి నిలిచిపోయిన నీరు, విద్యుత్

నారాయణఖేడ్, మే 12: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఒక మూలకు విసిరేసినట్టున్న తండా అది. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో నాగల్‌గిద్ద మండలంలో సుమారు 500ల జనాభా ఉన్న గిరిజన ఆవాసం. బీఆర్ఎస్ హయాంలో ప్రత్యేక పంచాయతీగా ఏర్పడి గ్రామాలతో సమానంగా అభివృద్ధి చెందిన తండా పరిస్థితి ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పూర్తిగా తలకిందులైంది. సోమవారం 'నమస్తే తెలంగాణ' శాంతినగర్ తండాను సందర్శించగా, తండావాసులు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడగా, ఇక తండాల పరిస్థితి సరేసరి. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయడం ఒకటైతే, తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యమా అని ఇప్పుడు తండాల కథ మళ్లీ మొదటికొచ్చింది. ప్రస్తుతం తండాల్లో నెలకొన్న పరిస్థితులకు శాంతినగర్ తండా ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. కేసీఆర్ ప్రభుత్వం తండాలను అక్కున చేర్చుకున్న తీరును, ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్య వైఖరిని గిరిజన బిడ్డలు బేరీజు వేసుకుంటున్నారు. సర్కారు తీరు బాగాలేదని, తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ఫలితంగా సమస్యలతో సతమతమవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


అధ్వానంగా మారిన శాంతినగర్ తండా రోడ్డు

### రోడ్డు పరిస్థితి అధ్వానం

కేసీఆర్ ప్రభుత్వంలో వేసిన రోడ్డు ప్రస్తుతం కంకర తేలి వాహనాలు వెళ్లలేని స్థితికి చేరింది. సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా పాడై పోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సదరు రోడ్డు మరమ్మతుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. అంతలోనే ఎన్నికలు రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో రోడ్డు నిర్వహణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా రోడ్డును బాగు చేయిస్తుందేమోనని తండావాసులు పెట్టుకున్న ఆశలు అడియాసలు అవుతున్నాయి. ఫలితంగా తరుచూ వాహనాలు ప్రమాదానికి గురై తండావాసులు గాయాల పాలవుతున్నారు. సత్వరమే రోడ్డు పనులు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

### నీటికోసం కర్ణాటకకు..

బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ పథకం నీటితో కర్ణాటకలోని సరిహద్దు గ్రామాల ప్రజలు తమ దాహార్తిని తీర్చుకోగా ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. పది రోజులుగా శాంతినగర్ తండాకు నీరు సరఫరా కావడం లేదు. దీంతో తండావాసులు కర్ణాటకలోని జంగికి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. నిత్యం నీటి సమస్యతో అల్లాడే నారాయణఖేడ్ వంటి ప్రాంతాలకు వరప్రదాయినిగా మారిన మిషన్ భగీరథ పథకం పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇంటి వరకు నీటిని సరఫరా చేయగా, అదేం విచిత్రమో గానీ కాంగ్రెస్ ఏడాదిన్నర కాలంగా సక్రమంగా నీరు సరఫరా కాని అనివార్య పరిస్థితులు నెలకొన్నాయి. మరీ ముఖ్యంగా ప్రస్తుత ఎండాకాలంలో నీటి కోసం గిరిజనులు పరుగులు పెట్టాల్సిన దుస్థితి దాపురించింది. కేవలం నిర్వహణ లోపం కారణంగానే తమ తండాకు నీరు సరఫరా కావడం లేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. రోజువారి అవసరాలకు బైక్‌లపై నీటిని తెచ్చుకుంటుండగా, పెండ్లిండ్లు, ఇతర శుభకార్యాలకు రూ.3 నుంచి 4వేల వరకు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటి అవసరాలను తీర్చుకుంటున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వెంటాడుతున్న విద్యుత్ సమస్య

కేసీఆర్ పాలనలో నిరాటంకంగా 24 గంటల విద్యుత్ సరఫరా కాగా, ఇప్పుడు విద్యుత్ సమస్య శాంతినగర్ తండావాసులను వెంటాడుతున్నది. నాలుగు రోజుల క్రితం తండాలోని ట్రాన్స్‌ఫార్మర్ పాడవగా, అప్పటి నుంచి తండాలో విద్యుత్ సరఫరా లేక అంధకారం అలుముకుంది. తండాలో తరుచూ విద్యుత్ సమస్య తలెత్తడం సర్వసాధారణంగా మారిందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రత్యేకాధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ తండావాసులంతా కలిసి డబ్బులు పోగేసి మరమ్మతులు చేసుకోవాలని చెబుతున్నారని గిరిజనలు వాపోయారు. తండాలో ఒక బోరుమోటరు ఉన్నప్పటికీ విద్యుత్ సమస్య కారణంగా సదరు బోరుమోటరు వినియోగానికి నోచుకోవడం లేదు.

### మమ్మల్ని పట్టించుకోవట్లేదు..



మేము ప్రతిరోజూ ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నం. మమ్మల్ని ఎవ్వరూ పట్టించుకోవట్లేదు. కేసీఆర్ గవర్నమెంట్ ఉన్నప్పుడు మాకు ఏ సమస్య లేదు. కరెంటు సరిగ్గా ఉండే, నీళ్లు మంచిగనే వచ్చినయి. మార్పు మార్పు అని అందరితోని ఓట్లు ఏయించుకొని గెలిచిండ్లు కానీ ఏం డెవలప్‌మెంట్ చేస్తలేరు. పది రోజుల నుంచి నీళ్లు అస్తలేవు, నాలుగు రోజుల నుంచి కరెంటు లేదు. ఆఫీసర్లకు ఫోన్ చేస్తే ఎత్తట్లేదు. మాకు చాలా కష్టం అయితుంది. మా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నం.
– ప్రబిత, శాంతినగర్ తండా

### కేసీఆర్ గవర్నమెంటే బాగుండే



కేసీఆర్ గవర్నమెంట్ ఉన్నప్పుడే మాకు బాగుండే. ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చినంక మాకు చాలా తిప్పలు అయితుంది. కేసీఆర్ గవర్నమెంట్ల ఒక్కరోజు కూడా నీళ్ల కష్టం రాలే. రోజూ ఇంటి ముంగటి దాక నీళ్లస్తుండే. ఇప్పుడు ఈ గవర్నమెంట్ అచ్చిన యాడాదిన్నర సంది అప్పుడు నీళ్లు అస్తలేవు. కరెంట్ సక్కగ ఉండది. తండోళ్లమంతా కలిసి పైసలేసుకొని ట్యాంకర్ తెప్పిచ్చుకొని ఎల్లదీస్తున్నం. ఎవ్వరూ పట్టించుకుంటలేరు. ట్రాన్స్‌ఫార్మర్ ఖరాబ్ అయి 4 రోజులైనా చేపిస్తలేరు. ఇది మంచిది కాదు. పేదోళ్ల గోస పోసుకుంటుండ్రు. –సువాలిబాయి, శాంతినగర్ తండా

### కొడుకు పెండ్లికి నీళ్లు కొంటున్నా..



కొడుకు పెండ్లి ఉంది సారు. తండాల నీళ్లు అస్తలేవు.. ఇంటి నిండా చుట్టాలు వచ్చిండ్రు. చేతులు కడుక్కోనికి నీళ్లు లేవు. రూ.3 వేలు ఇచ్చి ఒక ట్యాంకర్ నీళ్లు తీసుకుచ్చిన. నీళ్లు రాక పది రోజులాయే. కరెంట్ లేక నాలుగు రోజులాయే. ఈ కాలంలో అందరికీ అవసరమైన నీళ్లు, కరెంట్ లేకపోతే ఎట్లా బతకాలే. ఇంతకు ముందు ఉన్న టీఆర్ఎస్ సర్కార్ల నీళ్లు మంచిగ వచ్చినయి. ఇప్పుడు ఏమైందో ఏమో సరిగ్గ ఇడుస్తలేరు. దయచేసి నీళ్లు, కరెంటు ఇయ్యాలని కోరుతున్నా.
– మారుతినాయక్, శాంతినగర్ తండా

### కర్ణాటక ఊళ్లకేని నీళ్లు తేవాలే



తండాకు నీళ్లు రాక పది రోజులు అయింది. మా పొట్ట కోసం పనిచేసుడు ఏమో కాని రోజంతా నీళ్ల కోసం ఉరుకుడే ఉన్నది. కర్ణాటక బార్డర్ ఊరు జమ్గికి ఐదు కిలోమీటర్లు పోయి బైక్‌ల మీద నీళ్లు తెస్తున్నం. తండాల బైక్‌లు ఉన్నోల్లమంతా బైక్‌లకు బిందెలు కట్టుకుని నీళ్లు మోస్తున్నం. మా తండాకు రోడ్డు కూడా బాగాలేదు. కేసీఆర్ గవర్నమెంట్‌ల వేసిన రోడ్డే ఉన్నది. ఈ గవర్నమెంట్ రోడ్డు మంచిగ చేయాలే గదా.. చేస్తలేదు. తండాల సమస్యలు తీర్చి మాకు తిప్పలు లేకుండా చేయాలని కోరుతున్నా.
– శివాజీనాయక్, శాంతినగర్ తండా

# ఆదమరిస్తే అంతే..


సిద్దిపేట సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో అడుగు పెట్టాలంటేనే అధికారులు, ప్రజావాణి అర్జీదారులు జంకుతున్నారు. విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన వైర్లు కాళ్ల కింద ఉండడంతో షాక్ వస్తుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రతిఒక్కరూ వణికిపోతున్నారు.
– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా, మే 12


సిద్దిపేట కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో కాళ్ల కింద విద్యుత్ వైర్లు



# పోతారెడ్డిపేటలో విషాదం

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధి హామీ కూలీలు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- కారు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటున్న పోలీసులు


గోప దేవవ్వ (ఫైల్)


బ్యాగరి చంద్రవ్వ(ఫైల్)

దుబ్బాక, మే 12: కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఇద్దరు ఉపాధి హామీ కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రగాయాలతో దవాఖాన పాలైన విషాద ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేటలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతారెడ్డిపేటకు చెందిన బ్యాగరి చంద్రవ్వ (45), గోప దేవవ్వ(48), బైండ్ల లాస్యలతో పాటు మరికొందరు మహిళలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. సిద్దిపేట-రామాయంపేట రోడ్డు పోతారెడ్డిపేటలో ఎదురుగా అతి వేగంగా వస్తున్న కారు వారిని ఢీకొట్టింది. దీంతో బ్యాగరి చంద్రవ్వ(45), గోప దేవవ్వ (48) అక్కడికక్కడే మృతిచెందారు. మరో మహిళ బైండ్ల లాస్యకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను చికిత్స కోసం సిద్దిపేట దవాఖానకు తరలించారు. బెల్లంపల్లికి చెందిన బాల్మీకి తన నానమ్మతో కలిసి కారులో మెదక్‌లో జరిగే పెండ్లికి వెళ్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా ఎదురుగా వస్తున్న ఉపాధిహామీ కూలీలకు ఢీకొట్టాడు. డ్రైవింగ్ చేస్తున్న బాల్మీకిపై కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం కోసం దుబ్బాక సర్కారు దవాఖానకు తరలించినట్లు భూంపల్లి ఎస్సై హరికృష్ణ తెలిపారు.

### గుండెపోటుతో మరో కూలీ...

జహీరాబాద్, మే 12: ఉపాధి హామీ పనులు చేస్తుండగా గుండెపోటుతో మహిళా కూలీ మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి(డి)లో సోమవారం చోటుచేసుకుంది.


కమలమ్మ (ఫైల్)

గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏర్రోల కమలమ్మ తోటి కూలీలతో కలిసి గ్రామ శివారులో పనులు చేసేందుకు వెళ్లింది. పనులు చేస్తున్న క్రమంలో ఆమెకు ఒక్కసారిగా చాతీలో నొప్పి రావడంతో కింద పడిపోయింది. అక్కడే ఉన్న ఉపాధి హామీ ఎఫ్ఏ అనంతరామ్ కూలీల సహాయంతో వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆమెకు వైద్యాధికారులు పరీక్షలు చేస్తున్న క్రమంలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మండల ఉపాధి హామీ ప్రాజెక్టు అధికారి అశోక్‌కుమార్ దవాఖానకు వెళ్లి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతిరాలి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

# గ్రౌండ్ కాదు.. చెరువు..


సిద్దిపేటలోని నర్సాపూర్ చెరువులో పెరిగిన గుర్రపు డెక్క

చిత్రంలో ఉన్నది... గ్రౌండ్ కాదు.. చెరువే.. పొరపాటున గ్రౌండ్ అనుకొని వెళ్లరా.. అంతేసంగతి. సిద్దిపేట జిల్లా కేంద్రానికి పచ్చని హారంలా.. చూపరులను ఆకట్టుకునేలా ఉన్న నర్సాపూర్ చెరువులో గుర్రపుడెక్క పెరిగింది. అది... ఇంతింతై.. వటుడింతై అన్నట్లుగా చెరువును పూర్తిగా ఆక్రమించింది. అధికారులు నామమాత్రంగా డెక్కను తొలిగించి చేతులు దులిపేసుకున్నారు. డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయకుండానే నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా, మే 12


సిద్దిపేట చెరువు నుంచి వచ్చే కాలువలో పెరిగిన గుర్రపు డెక్క